నాడు పడిగాపులు.. నేడు ఇంటి వద్దకే పింఛన్

- టీడీపీ పాలనలో తిండీ తిప్పలు మానేసి కార్యాలయాల వద్ద పడిగాపులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి నెల 1వ తేదీన ఠంఛన్‌గా పింఛన్
- తలుపుతట్టి నగదు అందజేస్తున్న వలంటీర్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


చంద్రబాబు పాలనలో పింఛన్ కోసం జూపాడుబంగ్లా గ్రామసచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్ దారులు (ఫైల్)


జగనన్న పాలనలో భాస్కరాపురం గ్రామంలో ఇంటివద్దకే వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న వలంటీరు సుభాషిణి

జూపాడుబంగ్లా: టీడీపీ పాలనలో ప్రతి నెల ఒకటోవ తేదీన పింఛన్ సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు తిండీ తిప్పలు మానుకొని పడిగాపులు కాయాల్సివచ్చేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెల ఒకటోవ తేదీన ఠంఛన్‌గా పింఛన్ మొత్తాన్ని తెల్లవారకముందే ఇంటి తలుపులు తట్టి లబ్ధిదారుల చేతుల్లో పెడుతున్నారు. అంతేకాకుండా లబ్ధిదారులు వారు పొలంలో ఉన్నా, ఆసుపత్రిలో ఉన్నా, పని వద్ద ఇలా.. ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లి అందజేస్తున్నారు. రోజులు తరబడి పింఛన్ మొత్తం కోసం వేచిచూడాల్సిన బాధలు తప్పటంతో వృద్ధులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేలు పింఛన్

ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే పింఛన్ మొత్తాన్ని ప్రతి ఏటా రూ.250ల చొప్పున పెంచుతూ ఇప్పుడు రూ.3వేలు అందజేస్తుండటంతో అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మలు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ డబ్బు తమకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, మందులకు, నిత్యావసర సరుకులకు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా చేసిన జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

33,369 మందికి లబ్ధి

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడ్తూరు, కొత్తపల్లి, పాములపాడు, పగిడ్యాల మండలాల్లో కలిపి ఫిబ్రవరి మాసానికి గాను 33,369 పింఛన్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున రూ. 10,01,07,000ల నగదు పంపిణీ చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది జనవరి మాసానికి గాను నియోజకవర్గం వ్యాప్తంగా కొత్తగా 487 నూతన పింఛన్లు మంజూరు అయ్యాయి. సోమవారం సాయంత్రానికి జూపాడుబంగ్లా మండలంలో 93.23 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.

పడిగాపులు కాసే బాధ తప్పింది



చంద్రబాబు పాలనలో ప్రతి నెల పింఛన్ కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తిండీ తిప్పలు మానుకొని నగదు ఎప్పుడిస్తారా అని కాసుకొని కూర్చోవాల్సి వచ్చేది. ఒక్కో సారి రెండు మూడు రోజులు వేచి చూడాల్సి వచ్చేంది. జగనన్న సీఎం అయ్యాకా ప్రతి నెల ఒకటోవ తేదీన తెల్లవారకముందే వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్ నగదు చేతిలోపెడుతున్నారు. జగనన్న పాలనలో పింఛన్ మొత్తం రూ.3వేలకు పెంచటంతో పాటు పింఛన్ కష్టాలు తొలగిపోవడం చాలా సంతోషంగా ఉంది. **–రంగమ్మ, తర్తూరు**

పైసా ఖర్చులేకుండా నాబిడ్డకు పింఛన్ మంజూరైంది



నా బిడ్డ శ్రీజ మానసిక వికలాంగురాలు. టీడీపీ పాలనలో ఎన్నిమార్లు దరఖాస్తు చేసినా పింఛన్ రాలేదు. జగనన్న పాలనలో పైసా ఖర్చులేకుండా దరఖాస్తు చేసిన వెంటనే పింఛన్ ఇచ్చారు. ప్రతి నెల ఒకటోవ తేదీన తెలవారకముందే వలంటీరు వచ్చి పింఛన్ నగదు ఇచ్చిపోతున్నారు. ఈ సొమ్ము నా బిడ్డ మందులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా. **– యమునాదేవి, బాధితురాలి తల్లి**

నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఫిబ్రవరి మాసానికి మంజూరైన పింఛన్ల వివరాలు మండలాల వారీగా ...

మండలం పేరు	మంజూరైన పింఛన్లు
జూపాడుబంగ్లా	5,153
నందికొట్కూరు అర్బన్	5,062
నందికొట్కూరు రూరల్	5,304
కొత్తపల్లి	4,337
పగిడ్యాల	5,023
పాములపాడు	5,964
మొత్తం పింఛన్లు	33,369

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: స్థానిక లక్ష్మీ చెన్నకేవశ, ఆంజనేయ స్వామి దేవాలయాల ధర్మకర్తల మండలి నియామకం కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ మోహన్ సోమవారం తెలిపారు. గ్రామంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, సచివాలయం -1, దేవాలయాల నోటీస్ బోర్డులో నోటిఫికేషన్ ప్రతులను ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాలకు ధర్మకర్తల ఎన్నికకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తికి కలిగిన వారు తమ దరఖాస్తులను 20 రోజుల్లోగా నంద్యాల జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

దాతలు సహకరిస్తే మరింత అభివృద్ధి

పాములపాడు: దాతలు సహకరిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని వేంపెంట జెడ్పీహెచ్ స్కూలుకు అమెరికాలో నివాసముంటున్న గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన శిరుప పరమేశ్వరరెడ్డి, సోషల్ అసిస్టెంట్ కోటయ్య రూ.10,000 విలువ చేసే కుర్చీలు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సిబ్బంది కోసం కుర్చీలు అందజేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని, స్వగ్రామానికి వచ్చినప్పుడు పాఠశాలను సందర్శిస్తానని పరమేశ్వర రెడ్డి ఫోన్‌లో చెప్పినట్లు తెలిపారు.

క్లుప్తంగా

సొసైటీ అభివృద్ధే ధ్యేయం


బాధ్యతలు చేపడుతున్న పర్వతరెడ్డి శ్రీనివాసరెడ్డి

పగిడ్యాల: పగిడ్యాల సొసైటీని జిల్లాలోనే అభివృద్ధి పథంలో నడిపించి రైతుల అభ్యున్నతికి పాటుపడడమే తన ధ్యేయమని సొసైటీ చైర్మన్ పర్వతరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎం. ఘణపురం రైతులు ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఖాజా, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పంట నమోదు పరిశీలన


పంట నమోదు వివరాలపై రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో పంట నమోదును ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సోమవారం పరిశీలించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంట నమోదు కార్యక్రమం పూర్తి చేయడంతో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా పొలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఏఈఓ సాయి, వీహెచ్‌ఏ విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సేఫ్టీపై అవగాహన

వెలుగోడు: నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ప్రేరణ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీపై సోమవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి ప్రధాన రహదారి వెంట ప్రజలకు తెలిసే విధంగా ప్రదర్శన చేపట్టారు. ఏఎస్‌ఐ హుస్సేన్ బాషా, హెడ్ కానిస్టేబుల్స్ జగన్నాథ్, మాధవరావు, కానిస్టేబుల్స్ రవీంద్రుడు, ప్రేరణ యూత్ అసోసియేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు నూలు నాగేశ్వరరావు, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో పోలీసు పల్లెనిద్ర


మాట్లాడుతున్న సీఐ ప్రకాశ్‌కుమార్

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని మల్యాల గ్రామంలో సీఐ ప్రకాశ్‌కుమార్, ఎస్‌ఐ హుసేన్‌బాషా సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రజలందరూ స్నేహభావంతో మెలగాలని సూచించారు.

పొలంబడి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు వ్యవసాయాధికారులు నిర్వహించే పొలంబడి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ బీటీఎం చక్రవర్తి అన్నారు. సోమవారం మండలంలోని మల్యాల గ్రామంలో రైతులకు నానో యూరియా, డీఏపీ ఎరువుల వాడకంపై ప్రదర్శనా క్షేత్రం నిర్వహించారు. వీఏఏ శాంతిరాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు కాలేజ్ కెప్టెన్స్

నందికొట్కూరు: పట్టణంలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకురాలు మాధురి తెలిపారు. సోమవారం పట్టణంలోని కేవీఆర్ గా ర్డెన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. మంగళవారం పట్టణంలోని ఆల్వాల సత్రంలో ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జగనన్న కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

విగ్రహాలను ఆవిష్కరించాలి

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల, జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామమూర్తి కోరారు. పట్టణంలోని పటేల్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజకీయ విభేదాల వల్ల విగ్రహాల ప్రారంభోత్సవాలు చేపట్టలేదని, రెవెన్యూ, పోలీసు అధికారులు విగ్రహాలను ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసాద్, శ్రీనివాసులు, మహానంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పగిడ్యాల: ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన మండల అధికారులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పగిడ్యాల ఎంపీడీఓగా అనంతపురం జిల్లా ముదిగుబ్బ నుంచి బదిలీపై వచ్చిన శ్రీకవిరాజు బాధ్యతలు చేపట్టగా, తహసీల్దార్‌గా జీవీ నాగేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు.

కొత్తపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా తిరుపతయ్య బాధ్యతలు చేపట్టారు. ఈయన వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం నుంచి ఇక్కడికి రాగా ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ నాయక్ అనంతపురం జిల్లా పామిడి మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే ఎంపీడీఓగా జవహర్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా రాయచోటీ మండలం ఇక్కడికి వచ్చారు.

ఆత్మకూరు: ఆత్మకూరు తహసీల్దార్‌గా బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం నుంచి ఆయన ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరారు. ఈయన వైఎస్సార్ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

మహానంది: వైఎస్సార్‌జిల్లా నుంచి మహానంది మండలానికి బదిలీపై విచ్చేసిన రామచంద్రుడు సోమవారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. బండిఆత్మకూరు తహసీల్దార్‌గా సుమతి బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతపురం జిల్లా ఎల్లనూరు నుంచి ఇక్కడికి వచ్చారు.

వెలుగోడు: మండల తహసీల్దార్‌గా పి.విజయకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పులివెందులలో ఏఓగా పని చేస్తున్న ఆమెను ఇక్కడ తహసీల్దార్‌గా నియమించడంతో ఆమె విధుల్లో చేరారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీసీడీఓ సువర్చల

కొత్తపల్లి: పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని జీసీడీఓ సువర్చల సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులతో సమస్యలు, చదువుపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరానికి గాను పదో తరగతి విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటినుంచి విద్యార్థినులు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని పాఠాలను చదువుకోవాలనానన్నారు. అనంతరం భోజనశాల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణాబాయి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

సహకార సంఘాల ద్వారా రైతులకు సేవలు


భూమిపూజ నిర్వహిస్తున్న చైర్మన్

మహానంది: సహకార సంఘాల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందించడంతో పాటు రుణాలు మంజూరు చేస్తున్నట్లు గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు తెలిపారు. గుండంపాడు మార్గంలో సోమవారం పర్పస్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు,వ్యక్తిగత రుణాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నమన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి


చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న సూదిరెడ్డి మహేశ్వర రెడ్డి

నందికొట్కూరు: మండలంలోని ఆయా గ్రామాల రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ సూదిరెడ్డి మహేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సహకార సొసైటీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మధు, కొణిదెల ఎంపీటీసీ సురేష్, మాజీ చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్, ప్రతాప్ రెడ్డి, కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్


మిడుతూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ గంగావతి

జూపాడుబంగ్లా: నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్లు పథకంలో భాగంగా జగనన్నకాలనీల్లో పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ గ్రామసచివాలయాల్లో శరగవేగంగా కొనసాగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలో వ్యాప్తంగా ఉన్న 86 సచివాలయాల పరిధిలో 11,104 మంది లబ్ధిదారులకు జగనన్నకాలనీల్లో ఇళ్లస్థలాలు కేటాయించారు. స్థలాలు తీసుకొన్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొని నివాసాలుంటున్నారు. నిర్మించుకున్న ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం వారికిచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. నియోజకవర్గంలోని జూపాడు బంగ్లా మండలంలో ఇప్పటిదాకా 265, నందికొట్కూరు లో 296, మిడుతూరు 326, పాములపాడు 245, కొత్తపల్లిలో 2 చొప్పున ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. పగిడ్యాల, నందికొట్కూరు అర్బన్‌లో ఇంకా ఇళ్లస్థలాల ప్రక్రియ పూర్తికాలేదని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. లబ్ధిదారులు గ్రామసచివాలయాల వద్దకు వెళ్లి వారికి జగనన్నకాలనీల్లో కేటాయించిన ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ పక్రియను వేగవంతం చేయండి

మిడుతూరు: జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ల పక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గంగావతి సూచించారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం–1, వీపనగండ్ల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ పక్రియను పరిశీలించారు. ఆమె వెంట ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు సుధీర్, పవన్ కుమార్, కేశవతి ఉన్నారు.

జోరుగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతోంది. వెలుగోడు 4వ సచివాలయంలో చేపట్టిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ సోమవారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఆస్తిపై 10 సంవత్సరాల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని దస్తావేజుల్లో పేర్కొన్నారు. అలాగే భవిష్యత్‌లో ఎటువంటి వివాదాలు, తగాదాలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు.

క్రైస్తవులకు మంచి చేసిన ఏకైక సీఎం జగనన్న

- దేశంలో ఎక్కడా లేనివిధంగా పాస్టర్లకు గౌరవవేతనం
- ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- దైవసేవకుల ఆత్మీయ సమ్మేళనం
- వైఎస్సార్‌సీపీ విజయం కోసం పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనలు


బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని, డాక్టర్ దారా సుధీర్‌ను సన్మానిస్తున్న క్రైస్తవ సంఘాల కాపరులు

నందికొట్కూరు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా క్రైస్తవులకు మంచి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డేనని, పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తున్న ఏకైక రాష్ట్ర మనదేనని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి దైవసేవకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ పరిచయం చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మళ్లీ సీఎం వైఎస్ జగన్ కావాలని కోరుతూ ప్రభువును వేడుకున్నారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయానికి పాస్టర్ల ప్రత్యేక ప్రార్థన ఎంతో బలాన్ని చేకూరుస్తుందన్నారు. సమాజంలో అందరూ బాగుండాలని ప్రార్థనలు చేసేది క్రైస్తవులేనని గుర్తు చేశారు. దైవసేవకులందరి ఆర్థిక స్థితిగతులను గమనించిన సీఎం వైఎస్ జగనన్న ప్రతి నెల రూ. 5 వేలు గౌరవ వేతనం అందజేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ స్పష్టం చేశారు. అనంతరం బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని, సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్‌ను క్రైస్తవ సంఘ కాపరులు ఘనంగా సన్మానించారు. క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఏపీ క్రిష్టియన్ మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, జనరల్ సెక్రటరీ జోసెఫ్, సెక్రటరీ రవికుమార్, జాయింట్ సెక్రటరీ జయకాంత్, కర్నూలు జిల్లా సెక్రటరీ స్టీఫెన్ పాల్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రశాంతి, శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, కౌన్సిలర్లు లాలు, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, ఆర్టీసీ బబు, జబ్బార్, శ్రీకాంత్, నియోజకవర్గ క్రిష్టియన్ కమిటి సభ్యులు ప్రభుదాస్, యాకోబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లావాదేవీలు పకడ్బందీగా నమోదు చేయాలి

పగిడ్యాల: స్వయం సహాయక సంఘ సభ్యులు లావాదేవీల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని వైఎస్సార్ క్రాంతి పథం మండల అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాలు ఏర్పాటయిన నాటి నుంచి 2023 సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డీఎంజీ ఇస్మాయిల్, సీసీలు యాపిలయ్య, నాగన్న, జంగిలయ్య, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు : మండలంలోని వివిధ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాంనాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓకు జానకిరాంకు వినతి పత్రం అందజేశారు. లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంఈఓ శ్రీరాములకు వినతి పత్రం అందించారు. రమాదేవి, లక్ష్మీదేవి, ఆనందమ్మ, రాణమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

15 వరకు రబీ పంటల నమోదు

వెలుగోడు: ఈ నెల 15వ తేదీ వరకు రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవచ్చని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం వెలుగోడు పట్టణంలోని ఆర్‌బీకే సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బంది, రైతులకు సలహాలు, సూచనలు చేశారు. మండలంలో రబీలో 1,600 ఎకరాల్లో జొన్న, 500 ఎకరాల్లో వరి ఇప్పటి వరకు సాగు చేశారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామని తెలిపారు.


సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ కోరారు. సోమవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బంది వినోద్‌కు అందజేశారు. మల్లేశ్వరి, జరినాబి, అనురాధ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి మహిమలపై పాటలు రాస్తా

మహానంది: మహానందీశ్వర స్వామి మహిమలపై పాటలు రాయాలనుకుంటున్నానని ప్రముఖ సినీగేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తెలిపారు. సోమవారం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ అధికారులు, వేద పండితులు ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ఏఈఓ మధు, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మలతో ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

గిరిజన మహిళలకు ఉచితంగా స్కానింగ్


మాట్లాడుతున్న చైర్ పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు : డివిజన్ పరిధిలోని అన్ని చెంచు గిరిజన గూడేలకు చెందిన గర్భిణులకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచితంగా స్కానింగ్, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, వైద్యాధికారి రాయుడు తెలిపారు. పట్టణంలోని హెల్త్‌సెంటర్‌లో సోమవారం చెంచు గిరిజనులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గిరిజన మహిళలు పోషకాహారం తీసుకోవాలని, ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పారు. అనంతరం చెంచు గిరిజనులకు పోషకాహారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నబాయి, టీబీ సీనియర్ సూపర్‌వైజర్ మస్తానయ్య, ప్రతాప్, సరోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి

మహానంది: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా వైద్య సిబ్బంది పనిచేయాలని నంద్యాల జిల్లా జిలా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ప్రసన్న లక్ష్మి సూచించారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు.